
ఆంధ్రజ్యోతి
సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.4 ; కనిష్ఠం 24.8
కామారెడ్డి జిల్లా వార్తలు
3
మంగళవారం 12 మార్చి 2024



బిచ్కుందలో 10 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బిచ్కుంద, మార్చి11: మండలంలోని మంజీర పరివాహక ప్రాంతాల నుంచి ఆదివారం అర్ధరాత్రి అక్రమంగా తరలిస్తున్న పది ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్లను పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై చెప్పారు. పుల్కల్, ఖత్‌గావ్, హస్గుల్, మంజీర పరివాహక ప్రాంతాల నుంచి ట్రాక్టర్‌తో ఇసుక తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు చేయగా 10 ట్రాక్టర్‌లలో తరలిస్తున్న ఇసుకను పట్టుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎవరు కూడా ఇసుకను తరలించవద్దని ఎస్సై మోహన్‌రెడ్డి సూచించారు.

అవిశ్వాసానికి అడుగులు!

- కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం
- ఇప్పటికే ఖాళీ అవుతున్న బీఆర్‌ఎస్
- 4 నుంచి 27కు చేరిన కాంగ్రెస్ కౌన్సిలర్ల సంఖ్య
- సంఖ్యాబలం పెరగడంతో అవిశ్వాసానికి సిద్ధమైన కాంగ్రెస్
- కలెక్టర్‌కు అవిశ్వాసంపై వినతిపత్రం అందజేత
- చైర్‌పర్సన్ రేసులో ఇందుప్రియ, వనిత





బస్సులో క్యాంపునకు వెళ్తున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు

కామారెడ్డి టౌన్, మార్చి 27: కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి అడుగులు పడుతున్నాయి. దాదాపుగా అవిశ్వాసానికి రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై దాదాపు మూడునెలలు దాటింది. గత కొద్దినెలలుగా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో స్థానిక సంస్థల్లో అవిశ్వాసానికి అడుగులు పడుతూ వస్తున్నాయి. మున్సిపల్, మండల పరిషత్‌లలో చాలాచోట్ల బీఆర్‌ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ వైపు జంప్ అవుతున్నారు. సంఖ్యా బలాన్ని బట్టి ఇప్పటికే అనేక చోట్ల అవిశ్వాసానికి అడుగులు పడుతూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కామారెడ్డి మున్సిపల్‌లోనూ గత కొద్దిరోజులుగా అవిశ్వాసం పెట్టెందుకు కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతూ వస్తుందనే విషయం బహిరంగ రహస్యమే. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాకముందే కాంగ్రెస్ కౌన్సిలర్‌ల సంఖ్య నలుగురు ఉండగా, ఈ మూడు నెలలకాలంలో ఆ సంఖ్య 27కు చేరడంతో సంఖ్యాబలం పుంజుకుంది. దీంతో ఇక బీఆర్‌ఎస్‌కు చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టుజాహ్నవిపై అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమై అందరూ ఏకంగా సోమవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన వినతిపత్రాన్ని కాంగ్రెస్ కౌన్సిలర్‌లు అందించారు. ఇక రేపోమాపో అవిశ్వాస పరీక్షను కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించేందుకు చకచక అడుగులు పడుతున్నాయి.

ఖాళీ అవుతున్న బీఆర్‌ఎస్

గత నాలుగు నెలలక్రితం వరకు కామారెడ్డిలో ఊపు మీద ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలై అధికారాన్ని కోల్పోయింది. దీంతో ఆ పార్టీకి గడ్డుపరిస్థితులు ఎదురవుతూ వస్తున్నాయి. ఒక్కక్కరుగా ఆ పార్టీని వీడుతున్నారు. జిల్లాలో నాయకులు, కార్యకర్తల సంఖ్య తగ్గుతూ వస్తోంది. ముఖ్యంగా కామారెడ్డి మున్సిపల్‌లో పెద్దసంఖ్యలో బీఆర్ఎస్ కౌన్సిలర్‌లు ఉండేవారు. అందులోంచి ఒక్కొక్కరుగా కాంగ్రెస్ పార్టీలోకి వెళ్తుండడంతో ప్రస్తుతం ఆ పార్టీ కౌన్సిలర్‌లు 16మంది ఉన్నారు. అందులోని కొంతమంది కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి.

4 నుంచి 27కు చేరిన కాంగ్రెస్ కౌన్సిలర్ల సంఖ్య

గత నాలుగేండ్ల క్రిందట మున్సిపల్ ఎన్నికలలో మొత్తం 12 మంది కాంగ్రెస్ కౌన్సిలర్‌లు గెలువగా అప్పట్లో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీలోకి 8మంది కాంగ్రెస్ కౌన్సిలర్‌లు చేరారు. దీంతో కాంగ్రెస్ కౌన్సిలర్‌ల సంఖ్య నాలుగుకు చేరింది. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికల సమయంలో జరిగిన పలు రాజకీయ పరిణామాలతో బీఆర్ఎస్‌కు చెందిన మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియతోపాటు మరో నలుగురు కౌన్సిలర్లు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. దీంతో కాంగ్రెస్ కౌన్సిలర్‌ల సంఖ్య 9కి చేరింది.రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోయి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గత మూడు నెలల వ్యవధిలో ఇప్పటివరకు మరో 23 మంది కౌన్సిలర్‌లు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దీంతో ప్రస్తుతం వారి సంఖ్య 27కి చేరింది.

పెరిగిన సంఖ్యాబలంతో అవిశ్వాసానికి మొగ్గు..

కాంగ్రెస్ సంఖ్యాబలం అమాంతంగా మ్యాజిక్ ఫీగర్‌ను చేరుకుంటుండడంతో అవిశ్వాసానికి కాంగ్రెస్‌కౌన్సిలర్‌లు సిద్ధమవుతున్నారు. సోమవారం జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు వినతి పత్రం అందించారు.అటునుంచి అటే బస్సులో క్యాంపుకు తరలివెళ్లారు. రేపోమాపో అవిశ్వాసానికి సంబంధించిన తేదిని ప్రకటించి బలపరీక్ష నిరుపించుకునేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తుంది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావు,మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఇందు ప్రియ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలోకి కౌన్సిలర్‌లు వస్తున్నారని తెలిపారు. అదేవిధంగా కామారెడ్డి మున్సిపల్‌లో తమకు నచ్చిన వారి వార్డులలోనేమున్సిపల్ చైర్‌పర్సన్ పనులు, అభివృద్ధినిధులు కేటాయిస్తున్నందున అవిశ్వాసం పెట్టెందుకు సిద్ధపడినట్లు తెలిపారు. అయితే చైర్‌పర్సన్ రేసులో ఇద్దరు కౌన్సిలర్‌లు పోటీ పడుతున్నారు. ప్రస్తుతం ఉన్న వైస్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, 10 వ వార్డు కౌన్సిలర్ వనిత రవిలు చైర్‌పర్సన్ పదవిని ఆశిస్తున్నారు. ప్రస్తుతం చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం నెగ్గితే వీరిద్దరిలో ఎవరో ఒకరు చైర్‌పర్సన్ అయ్యే అవకాశం ఉంది. కాంగ్రెస్ అధిష్ఠానం వీరిద్దరిలో ఎవరిని చైర్‌పర్సన్ చేస్తుందో చూడాలి.



అవిశ్వాసం కోసం కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు వినతిపత్రం అందిస్తున్న కౌన్సిలర్లు

ప్రజావాణికి వచ్చే అర్జీలకు ప్రాధాన్యతనివ్వాలి

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్
- ప్రజావాణికి 48 ఫిర్యాదులు

కామారెడ్డి టౌన్, మార్చి11: ప్రజావాణికి వచ్చే అర్జీలకు ప్రాధాన్యతివ్వాలని, సమస్యను వెనువెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 48 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. ఇందులో భూసమస్యలకు సంబంధించి 24, డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కోసం 6, ఉపాధి కల్పన కోసం ఐదు వినతులు వచ్చినట్లు తెలిపారు. పంచాయతీరాజ్, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, విద్యుత్, పోలీసు శాఖకు సంబంధించిన వినతులను ఆయా శాఖాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటి ఫిర్యాదులు అప్పడే పరిష్కరించాలని తద్వారా దరఖాస్తుదారులకు సత్వర మేలుచేకూరే అవకాశం ఉంటుందని అన్నారు. జిల్లాస్థాయితో పాటు క్రిందిస్థాయి అధికారులు సైతం సమస్యల పరిష్కారంలో చొరవచూపాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో పీడీచందర్ నాయక్, ఐసీడీఎస్ పీడీ బావయ్య, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్



పిట్లంలో బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బీబీ పాటిల్

ఆలయాభివృద్ధికి కృషి: ఎంపీ బీబీ పాటిల్

మద్నూర్, మార్చి 11: సలాబత్‌పూర్ ఆంజనేయస్వామి ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ బీబీ పాటిల్ అన్నారు. బీజేపీలో చేరిన తర్వాత సోమవారం తన సొంత గ్రామం సిర్పూర్‌కు వచ్చి ఆలయంలో పూజలు అనంతరం మాట్లాడారు. పార్లమెంట్ పరిధిలో రోడ్ల విస్తరణకు తనవంతు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు హన్మాండ్లు, రమేష్ తమ్మేవార్, బాల కిషన్, తదితరులున్నారు.

పిట్లం: పిట్లంలోని రాజరాజేశ్వర ఫంక్షన్‌హాల్‌లో జుక్కల్‌నియోజకవర్గ బీజేపీ ముఖ్యకార్యకర్తలలో ఎంపీ బీబీపాటిల్ పాల్గొని మాట్లాడారు. మరోసారి జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా గెలిపించాలని ఆయన కోరారు.



- నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు
- ముస్తాబైన మసీదులు
- ఇఫ్తార్, సహర్ సమయాల్లో సైరన్‌ల కూతలు
- ఉమ్మడి జిల్లాలో నెల రోజులపాటు ఆధ్యాత్మిక సందడి

రంజాన్ వేళలు

మంగళవారం	బుధవారం
ఇఫ్తార్	సహర్
సా. 6.31	ఉ. 5.04

జ్ఞానాన్ని బోధించండి. సౌలభ్యాలను సృష్టించండి. ఆవేశం పెచ్చరిల్లినప్పుడు మౌనం వహించడం ఉత్తమ వ్యక్తి లక్షణం.

నెలవంక దర్శనం

నాగిరెడ్డిపేట, మార్చి11: ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ మాసం వచ్చేసింది. సోమవారం రాత్రి నెలవంక దర్శనం ఇవ్వడంతో మంగళవారం ఉదయం నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభమవుతున్నాయి. దీంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో నెల రోజులపాటు ఆధ్యాత్మిక సందడి నెలకొననుంది. ముస్లింల పవిత్ర గ్రంథమైన ఖురాన్ రంజాన్ మాసంలోనే అవతరించబడింది. దైవ ప్రవక్త హజ్రత్ మహమ్మద్ ముస్తాఫా సల్లల్లాహు అలైహి వసల్లంపై ఖురాన్‌ను సృష్టికర్త అల్లాహ్ అవతరింపజేశారని ముస్లింల విశ్వాసం. రంజాన్ మాసంలో ఖురాన్ అవతరించబడటంతో ఈమాసానికి అత్యంత ప్రాధాన్యత కలిగింది. దీంతో రంజాన్ మాసంలో ప్రతి ముస్లిం నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు పాటిస్తారు.

• కఠోర ఉపవాస దీక్షలు

ముస్లిం సోదరులు వయో, లింగ బేధం లేకుండా రంజాన్ మాసం కఠోర ఉపవాస దీక్షలను పాటిస్తారు. సూర్యోదయానికి ముందే తెల్లవారు జామున రంజాన్ మాసపు ప్రత్యేక క్యాలెండర్ ప్రకారం నిర్ణీత సమయానికి సహర్ వేళలో భోజనం ముగించుకుని అప్పటినుంచే ఉపవాస దీక్షను ప్రారంభిస్తారు. తిరిగి సాయంత్రం సూర్యాస్తమయం అయ్యాక ఇఫ్తార్‌తో దీక్షను ఖర్జూర పండ్లు, డ్రైఫ్రూట్స్, వివిధ రకాల ఫలాలతో దీక్షను విరమిస్తారు. దైవ ప్రవక్త హజ్రత్ మహ్మద్ ఖర్జూరం పళ్ళతోనే ఉపవాస దీక్షను విరమించే వారని విశ్వసించే ముస్లింలు ఖర్జూర పండ్లతోనే ఉపవాసాన్ని విరమిస్తారు.

• ఉపవాస దీక్షతో జీవన విధానంలో మార్పు

ఉపవాస దీక్షతో మనిషి జీవనవిధానంలో ఎంతో మార్పు కలుగుతుంది. ముస్లిం క్యాలెండర్ ప్రకారం తొమ్మిదోమాసం పేరు రంజాన్, షాబాన్ మాసం తర్వావత నెలవంక కనిపించగానే రంజాన్ మాసం ప్రారంభమవుతుంది. ఉపవాస దీక్షలను ఫార్సీ భాషలో రోజా అంటారు. అరబ్బీ భాషలో సౌమ్ అని అంటారు. రోజా (ఉపవాస దీక్ష)ను చేపట్టడం వల్ల ఆహారపానీయాలు మానడమే కాకుండా భక్తి మార్గంలో, దైవ చింతనలో గడపడంతో మనిషి జీవన విధానంలో ఎంతోమార్పు కలుగుతుంది. ఉపవాసదీక్ష పరులు ప్రతీరోజు సుమారు 14 గంటల పాటు ఉపవాస దీక్షలో గడుపుతారు. అబద్ధం ఆడకుండా, చెడు మాట్లాడకుండా, ఎవరిని నిందించకుండా, శారీరక, మానసిక వాంచనలకు దూరంగా నిగ్రహంతో ఉంటూ దైవ చింతలోనే గడుపుతారు.

• రంజాన్‌లో ప్రత్యేక నమాజ్ తరావి

రంజాన్ మాసంలో ముస్లింలు ప్రతీరోజు ఐదుసార్లు నమాజ్ చేయడంతోపాటు రంజాన్ మాసంలో ప్రత్యేక నమాజ్ అయిన తరావి నమాజ్‌ను ప్రత్యేకంగా చేస్తారు. రాత్రివేళలో ఇషా నమాజ్ అనంతరం ఈ ప్రత్యేక తరవావి నమాజ్‌ను చేస్తారు. రంజాన్ మాసపు నెలవంక దర్శనంతోనే ఈ తరావి నమాజ్ ప్రారంభమవుతుంది. శవ్వాల్ నెల వంక దర్శనంతో ఈనమాజ్ ముగుస్తుంది. ఖురాన్‌లోని 30 భాగాల్లో ప్రతిరోజు తరావి నమాజ్‌లో ఒక భాగం లేదా కొన్ని చోట్ల మసీదుల్లో రెండు, మూడు భాగాల చొప్పున చదివి పూర్తిచేస్తారు. తరావి నమాజ్ చదివించడం కోసం దాదాపు అన్నిమసీదులో నూ ఖురాన్ కంఠస్థమున్న హావీజ్‌లను ఏర్పాటు చేస్తారు.

• ముస్తాబైన మసీదులు

పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైనందున ఉమ్మడి జిల్లాల్లో మసీదులన్నీ ముస్తాబయ్యాయి. ఉపవాస దీక్షాపరులు ప్రతీరోజు ఐదుసార్లు నమాజ్ చేయడానికి విరమించడానికి మసీదులకు వెల్లనుండటంతో మసీదులకు రంగులు వేసి, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించి ముస్తాబు చేశారు.



నిజామాబాద్, జహీరాబాద్ పార్లమెంట్‌పై బీఆర్‌ఎస్ దృష్టి!

- నజర్ పెట్టిన బీఆర్‌ఎస్ అధిష్ఠానం
- ఈ రెండు స్థానాలను బీసీలకే కేటాయించేందుకు నిర్ణయం
- నిజామాబాద్ అభ్యర్థిగా బాజిరెడ్డి, జహీరాబాద్ అభ్యర్థిగా అనిల్‌కు ఖారారయ్యే అవకాశం
- ఇప్పటికే ఈ రెండు పార్లమెంట్‌లకు అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ
- జహీరాబాద్ అభ్యర్థిని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ నేతలు

నిజామాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీఆర్ఎస్ పార్టీ నేతలు నిజామాబాద్, జహీరాబాద్ పార్లమెంట్ స్థానాలపై దృష్టిపెట్టారు. నిజామాబాద్, జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఈదఫా బీసీ అభ్యర్థులనే నిలబెట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే ఎంపిక పూర్తిచేసిన పార్టీ నేతలు ఒకటి రెండ్రోజుల్లో ప్రకటించడంతో పాటు పూర్తిస్థాయిలో ఎన్నికల కోసం సన్నాహాలు చేపడుతున్నారు. ఈ రెండు పార్లమెంట్ పరిధిలో నేతల అభిప్రాయాలను తీసుకున్న పార్టీ అధ్యక్షులు ఈ నిర్ణయానికి వచ్చారు. ఇప్పటికే జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని నేతలతో ఒక దఫా చర్చించిన అధిష్ఠానం ఖాళీగా ఉన్న అన్ని పార్లమెంట్ అభ్యర్థులను ప్రకటించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. నిజామాబాద్ పార్లమెంట్ నుంచి మాజీ ఎమ్మెల్యేనే బరిలోకి దించేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. జహీరాబాద్ అభ్యర్థిగా పార్టీ నేతను నిలబెడుతున్నారు.

బీఆర్‌ఎస్‌క కీలకంగా పార్లమెంటు ఫలితాలు

ఈ పార్లమెంట్ ఎన్నికలు బీఆర్ఎస్‌కు కూడా కీలకం కానున్నాయి. కాంగ్రెస్, బీజేపీలకు ధీటుగానే బీఆర్ఎస్ అభ్యర్థులను నిలబెట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే బీజేపీ జహీరాబాద్ అభ్యర్థిగా ఎంపీ బీబీ పాటిల్, నిజామాబాద్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ అర్వింద్‌ను ప్రకటించింది. వారు ప్రచారాన్ని కూడా మొదలుపెట్టారు. కాంగ్రెస్ మొదటి జాబితాలో జహీరాబాద్ అభ్యర్థిగా మాజీ ఎంపీ సురేష్‌షెట్కర్‌ను ప్రకటించింది. ఈరెండు నియోజకవర్గాల పరిధిలో పార్టీ సీనియర్ నేతలను కాంగ్రెస్ దించుతుంది. జహీరాబాద్ ప్రకటించగా నిజామాబాద్ అభ్యర్థిని రెండో జాబితాలో ప్రకటించేందుకు ఆ పార్టీ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒకటి రెండ్రోజుల్లో అభ్యర్థిని ప్రకటించనున్నారు. కరీంనగర్ పార్లమెంట్‌తో ముడిపడి ఉండడంతో జీవన్‌రెడ్డి అభ్యర్థిత్వంవైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తుంది.

షెడ్యూల్ రాగానే ప్రచారం

ఈ రెండు పార్లమెంట్‌లకు అభ్యర్థుల ప్రకటన బీజేపీతోపాటు కాంగ్రెస్ చేయడంతో బీఆర్ఎస్ కూడా త్వరితగతిన ప్రకటించేందుకు సిద్ధమవుతుంది. ఈనెల 14 లేదా 15న పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉండడంతో దానికి ముందుగానే అభ్యర్థులను ప్రకటించనున్నారు. షెడ్యూల్ రాగానే ప్రచారం చేసుకునే విధంగా ఏర్పాట్లను చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని నియోజకవర్గాలకు బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించిన పార్టీ అధ్యక్షులు, మాజీ సీఎం కేసీఆర్ ఈ రెండు నియోజకవర్గాల్లో బీసీ అభ్యర్థులను బరిలోకి దించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఒకటి రెండ్రోజుల్లో ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రకటించనున్నారు. ఆర్మూర్, నిజామాబాద్ రూరల్, బాన్సువాడ ఎమ్మెల్యేగా నాలుగు దఫాలు పనిచేసిన ఆయనకు ఉమ్మడి జిల్లా పరిధిలో పరిచయాలు ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా పరిధిలో అన్ని నియోజకవర్గాల్లో ఆయన అనుచరులు ఉన్నారు. బీసీ కావడం, మున్నూరుకాపు సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాల్లో బీసీలు ఎక్కువగా ఉండడం వల్ల కలిసి వస్తుందని పార్టీ అధ్యక్షులు భావించినట్లు తెలుస్తోంది. ఆయనను నిర్ణయించడం వల్ల పార్టీలోని అన్ని వర్గాల నేతలు కలిసి పనిచేస్తారని అంచనాకు వచ్చి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రకటించే ముందు పార్లమెంట్ పరిధిలోని రెండు జిల్లాలకు చెందిన పార్టీ నేతలతో కూడా సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ముగ్గురు ఎమ్మెల్యేలతో పాటు మాజీ ఎమ్మెల్యేల అభిప్రాయాలను అధ్యక్షులు తీసుకుని ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ దఫా అభ్యర్థిని ప్రకటించడంతోపాటు పార్టీ నేతలందరూ జిల్లాలో ఉండి ప్రచారంలో పాల్గొనే విధంగా ముందస్తుగానే ఏర్పాట్లను చేసుకుంటున్నారు.

రెండ్రోజుల్లో అభ్యర్థిని ప్రకటించే అవకాశం

జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా అనిల్‌ను ప్రకటించనున్నారు. ఇప్పటికే నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. పటాన్‌చెరుకు చెందిన ఆయన పార్టీలో కీలకంగా ఉండడంతో ఈ దఫా జహీరాబాద్ సీట్ కేటాయిస్తున్నట్లు పార్టీ నేతల సమాచారం బట్టి తెలుస్తుంది. రెండు రోజుల క్రితం జరిగిన సమావేశంలో కూడా నేతలందరికి ఇదే విషయాన్ని వివరించినట్లు తెలుస్తోంది. ఈ రెండు పార్లమెంట్ స్థానాలకు ఒకటిరెండ్రోజుల్లో వీరిపేర్లను అధికారికంగా ప్రకటించనుండగా ఇప్పటికే పార్టీ నేతలకు తెలియడంతో ఏర్పాట్లలో నిమగ్నమవుతున్నారు. అభ్యర్థిత్వాలను ప్రకటించగానే ప్రచారాలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. షెడ్యూల్ లోపే కాంగ్రెస్ అభ్యర్థిని కూడా ప్రకటిస్తే అన్ని పార్టీల ప్రచారాలు జోరందుకునే అవకాశం ఉంది.

ప్రతీ ఒక్కరు భక్తిభావనను అలవర్చుకోవాలి

● బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

కోటగిరి,మార్చి11: సమాజంలో ప్రతీ ఒక్కరు భక్తిభావనను అలవర్చుకోవాలని మాజీ శాసన సభ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.పొతంగల్ మండలంలోని హంగర్గ గ్రామంలో అఖండ హరినామ సప్తాహ సోమవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే పోచారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సప్తాహలో వీణా పట్టుకుని వాయించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గంగాధర్, అనిల్,శివరాజ్ పటేల్, డీసీసీబీ డైరెక్టర్ శాంతేశ్వర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిబ్బందికి కంటి అద్దాల పంపిణీ

ఖిల్లా, మార్చి 11:ప్రతిదినం మండుటెండలో ఎండతీవ్రతను తట్టుకొని విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సిబ్బందికి పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగెనెవార్ సోమవారం కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రతను తట్టుకొని సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని వారి కంటికి చల్లదనం ఇచ్చే కంటి అద్దాలను, కూలింగ్, స్టోరేజీ వాటర్ బాటిల్స్‌ను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఎండలో పనిచేసే ట్రాఫిక్ సిబ్బంది ఆరోగ్య విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవడం తమ కర్త వ్యంగా భావిస్తున్నామని సీపీ అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అటవీ సంపదను రక్షించడం ప్రతీ ఒక్కరి బాధ్యత

ఇందల్వాయి, మార్చి 11: అటవీ సంపదను రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఇందల్వాయి ఎఫ్ఆర్‌వో రవిమోహన్‌భట్ అన్నారు. సోమవారం ఇందల్వాయి అటవీ రేంజ్ పరిధిలోని మద్దుల్ తండా తదితర గ్రామాల్లో అడవీ సంపదపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎవరు కూడా అటవీలో చెట్లను నరకడం, తునికాకు సేకరణ కోసం, ఇప్పపువ్వు పేరడం కోసం అటవీకి నిప్పు పెడుతున్నారని దీంతో విలువైన అటవీ సంపద అగ్నికి ఆహుతి అవుతోందన్నారు. మేకలు, గొర్రెల కాపరులు చెట్లను నరకడం చేయవద్దన్నారు. అటవీ ప్రాంతంలోకి వెళ్లేవారు బీడీలు, సిగరేట్లు తాగి ఎక్కడపడితే అక్కడ పారేయడం వల్ల అటవీ అగ్నికి ఆహుతి అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎఫ్ఆర్‌వో శ్రీనివాస్, అటవీ శాఖ సిబ్బంది ఆనంద్, ఆసీఫ్‌ఉద్దీన్, తదితరులు ఉన్నారు.



పాఠశాలలోని విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే

బీబీపేట, మార్చి 11: మండలంలోని తుజాల్‌పూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఉదయం ప్రార్థన సమయానికి పాఠశాలకు చేరుకుని విద్యార్థులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్నారు. ప్రార్థన సమయానికి ఆలస్యంగా వచ్చిన ఉపాధ్యాయులపై అసహనం వ్యక్తం చేశారు. పాఠశాలలోని ఉపాధ్యాయుల హాజరు రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదోతరగతి విద్యార్థులు ఏకాగ్రతతో చదివితే విజయం సొంతమవుతుందని, మంచి మార్కులు సాధించవచ్చని అన్నారు. ప్రతిమనిషికి వైద్యం, విద్యనే ప్రధాన అంశాలని వాటిలో అక్రమాలకు చోటు ఇవ్వకుండా నియోజకవర్గ ప్రజలందరికీ విద్య, వైద్యం అందేలా కృషిచేస్తానని ఆయన అన్నారు.

● ధరణి సమస్యలు వెనువెంటనే పరిష్కరించాలి

కామారెడ్డిటౌన్: కామారెడ్డి నియోజకవర్గంలో నెలకొన్న ధరణి సమస్యలను వెనువెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం రెవెన్యూ అధికారులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో రెవెన్యూ విభాగంలో నెలకొన్న భూవివాదాలు, తగదాలు, ధరణి సమస్యలు తదితర వాటిని అడిగి తెలుసుకున్నారు. ధరణి సమస్యలపై ప్రజలు ఇచ్చిన వినతులు సాధ్యమైనంత తొందరగా పరిష్కరించాలని అన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా పారదర్శకంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

పదోతరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

రాజంపేట, మార్చి 11: రాజంపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం 10వ తరగతి విద్యార్థులకు హెల్పింగ్ బ్రిడ్జిఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్‌లు అందించారు. ప్రతి విద్యార్థి ఒక సంకల్పంతో ముందుకు వెళ్లాలని ఉన్నత శిఖరాలను అధిరోహించి దేశసేవలో నిమగ్నం కావాలని భారత దేశాన్ని ఉన్నతమైన దేశంగా మార్చడానికి ప్రతి విద్యార్థి కృషిచేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఈశ్వర్, సంస్థ ప్రతినిధులు అన్వేష రావు, రహమాద్‌హుస్సేన్, ఉపాధ్యాయులు శ్రీదివ్య, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంతోనే జీరోబిల్లులు రావడం లేదు'

దోమకొండ, మార్చి11: రాష్ట్రప్రభుత్వం గృహజ్యోతిలో భాగంగా జీరో బిల్లు రావాల్సి ఉండగా మండలంలోని కొన్ని గ్రామాలలో విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంతో జీరో బిల్లు రావడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసి విద్యుత్ మీటర్‌నంబర్, ఆధార్‌నంబర్‌లతోపాటు అన్ని వివరాలను అందజేసినా ఆన్‌లైన్‌లో తప్పుగా ఎంట్రీ చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగేవిధంగా సిబ్బంది ప్రవర్తిస్తున్నారని ఆరోపిస్తున్నారు. మండలంలోని గొట్టిముక్కల గ్రామానికిచెందిన ఆసానిరాజిరెడ్డి తన ఇంటికి సంబంధించిన పూర్తివివరాలను అందజేసినా జీరో బిల్లు రాలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కోరారు.

అగ్నిప్రమాదంలో రెండిళ్లు దగ్ధం



బాయంపల్లిలో దగ్ధమైన ఇల్లు

లింగంపేట, మార్చి 11: మండలంలోని బాయంపల్లి, సజ్జన్‌పల్లి గ్రామాల్లో సోమవారం జరిగిన అగ్నిప్రమాదంలో రెండు నివాస గృహాలు దగ్ధమయ్యాయి. ప్రమాదంలో రూ.3లక్షల ఆస్తి నష్టం జరిగిందని ఆర్‌ఐ బాలయ్య తెలిపారు. బాయంపల్లి గ్రామానికి చెందిన కండ్లపల్లి సాయిలుకు చెందిన పెంకుటిల్లు విద్యుదాఘాతంతో కాలి బూడిదయిందని, ఇంట్లోని విలువైన పత్రాలతో పాటు బట్టలు, బియ్యం, విలువైన టేకు కలప ఇతర సామాగ్రి కలిపోయాయని, రూ.2లక్షల 50వేల ఆస్తినష్టం సంభవించిందని ఆయన తెలిపారు. సజ్జన్‌పల్లి గ్రామానికి చెందిన నీల పోచయ్యకు చెందిన నివాసపు గుడిసె విద్యుదాఘాతంతో కాలిబూడిదయ్యిందని ఇంట్లోని బట్టలు, వంటపాత్రలు ఇతర సామగ్రి కలిపోయిందని ప్రమాదంలో రూ.50వేల ఆస్తినష్టం సంభవించిందని ఆయన తెలిపారు.

● కన్నాపూర్‌లో ఇల్లు దగ్ధం

రామారెడ్డి: రామారెడ్డి మండ లం కన్నాపూర్ గ్రామానికి చెంది న తోకల నర్సవ్వకు చెందిన ఇల్లు షార్ట్‌సర్క్యూట్‌తో ఆదివారం అర్థ రాత్రి దగ్ధమైనట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ లక్ష్మణ్ తెలిపారు. మంటలు పెద్దఎత్తున చెలరేగడ ంతో స్థానికులు అగ్నిమాపక సి బ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను ఆర్పివేశారని తెలిపారు. ఈ అగ్నిప్రమాదంలో రెండున్నరతులాల బంగారం, 20 తులాల వెండి, 50వేల నగదు, విలువైన వస్తువులు దగ్ధమైనట్లు బాధితులు తెలిపినట్లు చెప్పారు. ఆర్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఘటనస్థలాన్న పరిశీలించారు.

నిజాంసాగర్ ఆయకట్టు పంటను కాపాడుకుంటాం

● ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి



నల్ల చెరువు తూమును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పోచారం

బీర్కూర్, మార్చి11: నిజాంసాగర్ ఆయకట్టు కింద గల లక్షా 30వేల ఎకరాల పంటలను కాపాడుకుంటామని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మండల ఇరిగేషన్ అధికారులు, స్థానిక నాయకులు, రైతులతో కలిసి గ్రామ శివారులోని నల్ల చెరువును, తూమును పరిశీలించారు. నల్లచెరువు తూములో చెత్తాచెదారం పేరుకుపోవడంతో చుక్కనీరు తూము నుంచి రావడం లేదు. దీంతో చెరువు కింద గల పంటలకు సాగునీరు అందడం లేదు. దీంతో స్థానిక నాయకులు, రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు ఎమ్మెల్యే నల్ల చెరువు తూమును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్ల చెరువులో కావాల్సినంత నీరు ఉందని తూము జామ్ కావడం వల్ల పంట పొలాలకు సాగునీరు అందడం లేదన్నారు. తూము ఇరుక్కున్న చెత్తాచెదారాన్ని తొలగించేందుకు ప్రత్యేక గజ ఈతగాళ్లను రప్పిస్తున్నామని అన్నారు. యాసంగి సీజన్‌లో నిజాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు కింద రైతులు లక్షా ముప్పై ఎకరాలలో పంటలు సాగు చేస్తున్నారని తెలిపారు. ఈ మేరకు ప్రాజెక్టు ద్వారా ఏడు విడతల్లో పంటలకు సాగునీరు అందించేందుకు షెడ్యూల్ రూపొందించారని అన్నారు. ప్రస్తుతం ఆరో విడత సాగు నీరు విడుదల చేశారని ఈనెల 22 వరకు నీటి సరఫరా కొనసాగుతుందని తెలిపారు. అనంతరం ఏడో విడత సాగునీరు విడుదల చేస్తారని అన్నారు. రైతులు భయపడాల్సిన అవసరం లేదని, సాగునీరు అందించి సాగర్ కింద పంటలను కాపాడకుంటామని అన్నారు. ఆయన వెంట ఇరిగేషన్ అధికారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.నల్లచెరువు తూము ద్వారా పంట పొలాలకు సాగునీరు అందక పంటలు ఎండిపోయే స్థితికి చేరుకోవడంతో ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి నీటి పారుదల శాఖ అధికారులతో తూమును పరిశీలించారు.

సేవాలాల్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలి

● నేడు ఎల్లారెడ్డిలో అధికారికంగా జయంతి వేడుకలు



మాట్లాడుతున్న బంజారా సేవా సంఘం నాయకులు

ఎల్లారెడ్డి, మార్చి 11: నేడు ఎల్లారెడ్డి పట్టణంలోని ముత్యాపు రాఘవుల ఫంక్షన్ హాల్‌లో అధికారికంగా నిర్వహించే సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయా మండలాల ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నాయకులు అన్నారు. సోమవారం ఎల్లారెడ్డి పట్టణంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నేడు పట్టణంలో బంజారాల ఆరాధ్యదైవం సద్గురు శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ ఎల్లారెడ్డి నియోజకవర్గ స్థాయిలో ఎల్లారెడ్డిలో సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు, ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్‌తో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ వివిధ మండలాల బంజారాల నాయకులు, కారోబార్లు, యువకులు, గిరిజన సంఘాలు, మహిళలు పెద్ద సంఖ్యలోని పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. సంత్ సేవాలాల్ శాంతి స్వరూపమని, ఆయన చూపిన అడుగు జాడల్లో బంజారాలంతా నడుచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాల బంజారా సంఘం అధ్యక్షులు లింబేస్ రాథోడ్, గన్యా, శంకర్, బాబుసింగ్, నాయకులు సురేందర్, గోవింద్, పరశురాం, హరిలాల్, పీర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అభివృద్ధిపైనే ప్రత్యేక దృష్టి: జుక్కల్ ఎమ్మెల్యే

బిచ్కుంద, మార్చి11: ఓట్ల కోసం ఎన్నికల వేళ హడావుడి చేస్తూ బిచ్కుంద పట్టణంలో సెంట్రల్ లైటింగ్, నాలుగు వరుసల రోడ్డు పనులకు తవ్వకాలు జరిపి అర్థంతరంగా నిలిపిన అభివృద్ధి పనులపై దృష్టిసారిస్తానని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. సోమవారం బిచ్కుంద పట్టణంలో సెంట్రల్ లైటింగ్ నాలుగు వరుసల రోడ్డు పనుల కోసం శిలాఫలాకం ఆవిష్కరించారు. ప్రభుత్వఆసుపత్రిని సందర్శించి నియోజకవర్గానికి మెడికల్ కళాశాల మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదిక ఇచ్చి సీఎం రేవంత్‌రెడ్డి, వైద్యఆరోగ్యశాఖ మంత్రిని కోరుతానన్నారు. మార్కెట్ యార్డు ఆవరణలో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ నాగ్‌నాథ్ పటేల్‌తోపాటు పత్లాపూర్, కందర్‌పల్లి, దౌల్తాపూర్ గ్రామాలకు చెందిన ఉపసర్పంచ్‌వార్డు సభ్యులు కాంగ్రెస్‌లో చేరడంతో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ తన స్థాయిని కించపరుచుకుంటున్నాడని, వాటిని పట్టించుకోకుండా నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తానని అన్నారు. బిచ్కుంద పట్టణాన్ని త్వరలోనే మున్సిపాలిటీగా మార్చేందుకు ఎంతో సమయం పట్టదని పేర్కొన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ మాజీఎంపీ సురేష్‌షెట్కార్, కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్‌అప్ప, విఠల్‌రెడ్డి, వెంకటరాంరెడ్డి, నాగనాథ్, పార్టీ అధ్యక్షుడు గంగాధర్ పాల్గొన్నారు.

'రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలి'

బీర్కూర్, మార్చి 11: ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్‌నిధి పథకానికి సంబంధించిన డబ్బులు రావాలంటే రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఏఈవో శ్రావణ్‌కుమార్ రైతులకు సూచించారు. సోమవారం బీర్కూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఈకేవైసీ చేయించుకుని రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈవో మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా తమ ఆధార్‌కార్డును తమ మొబైల్ నెంబర్‌కు అనుసంధానం చేసుకోవాలన్నారు. అప్పుడే 15, 16వ విడత డబ్బులు బ్యాంకు ఖాతలో జమ అవుతాయని అన్నారు. ఇదిలా ఉండగా కొంతమంది రైతులు ఇప్పటివరకు తమ బ్యాంకు అకౌంట్‌కు ఆధార్ కార్డు లింక్ చేయకపోవడం వల్ల కూడా డబ్బులు ఖాతాలో జమ కావడం లేదన్నారు. వారు కూడా తప్పనిసరిగా ఖాతాను ఆధార్ కార్డుతో అనుసంధానం చేసుకోవాలని సూచించారు.

'కిసాన్ మహా పంచాయతీ'ని విజయవంతం చేయండి

కామారెడ్డిటౌన్, మార్చి 11: జిల్లా కేంద్రంలో ఈనెల 14న జాతీయ రైతు సంఘాల పిలుపుమేరకు నిర్వహించే బైక్‌ర్యాలీ, కిసాన్ మహా పంచాయతీని విజయవంతం చేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి రామకృష్ణ అన్నారు. సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గతంలో రైతు ఉద్యమాలకు తలొగ్గివారి యొక్క డిమాండ్ల సాధనకు ఒప్పుకొని ఇప్పుడు దొంగ చాటున పాత నిబంధనలోనే కొనసాగిస్తామని వారి ప్రయత్నాలు కనిస్తున్నాయని అన్నారు. ఎలక్ట్రిక్ పవర్ ప్లాంట్స్ రహాదారులు సముద్రమార్గాలు, రైల్వేలు తదితర సంస్థలు కూడా ఈ దేశ సంపదను ఆదానికి చెందినటువంటి సంస్థలకు అప్పగించడం జరిగిందని ఇక మిగిలింది వ్యవసాయరంగమేనని అన్నారు. కావున కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తు నిర్వహించే ర్యాలీకి పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలనికోరారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు పరమేష్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ప్రకాష్,ఎస్‌హెచ్‌అంబన్న, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'మహిళా సమస్యలపై పోరాటానికి సిద్ధం'

కామారెడ్డిటౌన్, మార్చి 11: బీజేపీలో మహిళా కార్యకర్తలను పెంచేందుకు కృషిచేయడంతో పాటు మహిళా సమస్యలపై పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉంటానని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు విశ్వనాథుల అనిత తెలిపారు. సోమవారం నూతనంగా జిల్లా అధ్యక్షురాలిగా నియామకమైన సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మహిళల కోసం తీసుకువచ్చిన అనేక పథకాలను ప్రతి మహిళకు చేరేవిధంగా జిల్లాలోని ప్రతి మహిళా కార్యకర్తను ప్రోత్సహించడంతో పాటు ఆయా మండలాల్లో మహిళా కార్యకర్తల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తానని తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మహేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

లింగంపేట, మార్చి 11: మండల కేంద్రానికి చెందిన దాసరి అశోక్ (40) అప్పుల బాధతో ఇంటి సమీపంలోని బావిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. అశోక్ మేస్త్రీ పని చేస్తూ మద్యానికి బానిసగా మారి అప్పులు చేయడంతో అప్పుల బాధ భరించలేక ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు వారు తెలిపారు. మృతునికి భార్య లక్ష్మి, ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు.

ఏటీఎం పాయింట్ బుక్కుల ఏర్పాటు

దోమకొండ, మార్చి 11: మండల కేంద్రంలోని అన్ని ఏటీఎంలలో సోమవారం ఏఎస్ఐ సుబ్రహ్మణ్యచారి పాయింట్ బుక్కులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏటీఎం సెంటర్‌ను పోలీసులు ఉదయం, సాయంత్రం తనిఖీలు చేపడుతారని రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఏటీఎం సెంటర్‌లో ఏర్పాటుచేసిన పాయింట్ బుక్కులలో ఎస్ఐ నంబర్ ఉంటుందని ఏటీఎం వద్ద ఎవరైన ఏదైన ఆపదలో ఉన్నప్పుడు వెంటనే పాయింట్ బుక్కును తెరిచ్చి ఆ నంబర్‌కు కాల్‌చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు స్వామి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా కుంట రాంరెడ్డి

సదాశివనగర్, మార్చి 11: సదాశివనగర్ మండల బీజేపీ అధ్యక్షునిగా కల్వరాలకు చెందిన కుంట రాంరెడ్డి ఎన్నికయ్యారు. మొదట నుండి ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తగా చురుకుగా పనిచేసిన రాంరెడ్డి పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తు అన్ని కార్యక్రమాలను విజయవంతం అయ్యేందుకు కృషి చేసినందుకు అధ్యక్ష పదవి దక్కినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. రాంరెడ్డి ఎన్నిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తూ సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు.

'పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరికలు'

పిట్లం, మార్చి 11: సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆరు పథకాలను తప్పనిసరిగా అమలు చేస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాంరెడ్డి, హన్మండ్లు మోహన్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బోడ్లరాజు, సూరత్‌రెడ్డి, శివ, గంగరాం పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుల నియామకం

కామారెడ్డిటౌన్, మార్చి 11: కామారెడ్డి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ నాయకుల నియామకాలనుసోమవారం చేపట్టినట్లు జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఇలియాస్ తెలిపారు. నియోజకవర్గ సెక్రటరీగా శిరిష్‌గౌడ్, సోషల్‌మీడియా కోఆర్డినేటర్‌గా భైరవప్రసాద్‌రెడ్డి, పట్టణ సోషల్‌మీడియా కన్వీనర్‌గా అశ్వక్‌లకు నియామక పత్రాలు అందించామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకోవడానికి యువతి, యువకులను ప్రోత్సహించాలని, దేశంలో కాంగ్రెస్ పార్టీ ఒకటే సెక్యులర్ భావజాలంతో యువకులకు పెద్దపీట వేస్తుందని అన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన పలువురికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు సందీప్, జనరల్ సెక్రటరీ ఆమెర్, సర్వర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ కృషి

● జిల్లా అధ్యక్షుడు అమబీర్ మనోహర్‌రావు

నాగిరెడ్డిపేట, మార్చి 11: ఉపాధ్యాయులు సమస్యలను పరిష్కరించడానికి పీఆర్‌టీయూ తెలంగాణ సంఘం కృషి చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అంబీర్ మనోహర్‌రావు తెలిపారు. ఆయన సోమవారం పీఆర్‌టీయూ తెలంగాణ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా స్థానిక హైస్కూల్‌లో సభ్యత్వ నమోదు జరిపి ఉపాధ్యాయుతో కలిసి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ 317 జీవో బాధిత ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు పంపించేందుకు పీఆర్‌టీయూ తెలంగాణ సంఘం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జనపాల లక్ష్మీరాజం, అసోసియేట్ అధ్యక్షులు సాయాగౌడ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా నర్సింలు

ఎల్లారెడ్డి, మార్చి 11: భారతీయ జనతా పార్టీ ఎల్లారెడ్డి మండల అధ్యక్షుడిగా పెద్దెడ్ల నర్సింలును సోమవారం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. తనపై నమ్మకంతో పదవి ఇచ్చినందుకు జిల్లా అధ్యక్షురాలు అరుణ తారకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకంతో ఇచ్చిన పదవికి పార్టీ కోసం ఎల్లవేళలా కృషి చేస్తానని ఆయన అన్నారు.

గృహహింస వరకట్న కేసు నమోదు

ఎల్లారెడ్డి, మార్చి 11: తల్లిగారి ఇంటి నుంచి అదనపు కట్నం బంగారం తేవాలని వేధిస్తున్న భర్తపై గృహ హింస వరకట్నం కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ మహేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం .. ఎల్లారెడ్డి మండలంలోని మత్తమాల గ్రామానికి చెందిన సుగుణ అనే మహిళకు గత 25 సంవత్సరాల క్రితం మెదక్ జిల్లాలోని కొత్తపల్లికి చెందిన మల్లయ్యతో వివాహం జరిగిందని ఆమెకు సంతానం లేకపోవడంతో 15 సంవత్సరాల క్రితం రెండో వివాహం చేసుకున్న మల్లయ్యకు ముగ్గురు సంతానం గలదు. గత కొన్ని రోజుల నుంచి సుగుణ భర్త మల్లయ్య రెండవ భార్య మంజుల ఇద్దరు తల్లిగారి ఇంటి నుంచి డబ్బులు బంగారం తీసుకురావాలని వేధిస్తున్నారని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు సేవాలాల్ మహరాజ్ జయంతి

● హాజరుకానున్న ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

ఎల్లారెడ్డి, మార్చి 11: పట్టణ కేంద్రంలోని ముత్యపు రాఘవులు పెంటయ్య ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ప్రభుత్వం అధికారికంగా సేవాలాల్ మహరాజ్ జయంతిని నిర్వహించడం జరుగుతుందని ఎల్లారెడ్డి తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు హాజరవుతున్నారని బంజారా నాయకులు, ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మున్సిపల్ బడ్జెట్ ప్రత్యేక సమావేశం

ఎల్లారెడ్డి, మార్చి 11: ఎల్లారెడ్డి మున్సిపాలిటీని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఆయన అధ్యక్షతన ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో 2024-25 సంవత్సరానికి సంబంధించి మున్సిపల్ బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రూ.5 కోట్ల 33 లక్షల 70 వేల బడ్జెట్ అంచనా వేయడం జరిగిందని తెలిపారు. అందుకు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సుజాత, కో ఆప్షన్ సభ్యులు మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, రాజు, మేనేజర్ వాసంతి, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

నిజాంసాగర్, మార్చి 11: మండలంలోని కొమలంచ గ్రామంలో ఉపాధి హామీ నిధులు రూ.5లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించినట్లు కాంగ్రెస్ నాయకులు నాగభూషణం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామ గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జయ ప్రదీప్, మండలాధ్యక్షుడు రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోర్గల్ శివారులో పంటల పరిశీలన

నిజాంసాగర్, మార్చి11: మండలంలోని వడ్డేపల్లి క్లస్టర్ పరిధిలో గల గోర్గల్ శివారులో పంటలను సోమవారం ఏఈవో రేణుక పరిశీలించారు. ఈ సందర్భంగా నువ్వులు, తదితర పంటలను పరిశీలించి, నువ్వుల పంటలో పొగాకు లద్దె పురుగు వృద్ధి ఎక్కువగా ఉందని గమనించడం జరిగిందన్నారు. నివారణకు క్లోరోపైరిపాస్ ఎకరాకు 500 ఎంఎల్, క్వినాల్ఫాస్ 400 ఎంఎల్, వరి పంట నాటు వేసే పద్ధతిలో కన్నా వెదజల్లే పద్ధతిలో వేసిన వరి పంటకు పురుగుల బెడద తక్కువగా ఉంటుందన్నారు. పొట్ట దశలో తెల్ల కంకి రాకుండా కార్బా హైడ్రోక్లోరైడ్ 400 యంఎల్ ఎకరాకు స్ప్రే చేయాలని రైతులకు సూచించారు.



నువ్వుల పంటను పరిశీలిస్తున్న ఏఈవో